## మన(సు)లో మాట

పాఠకులందరికీ సంఘమిత్ర 'శిఖర' నామ సంవత్సర యుగాది శుభాకాంక్షలను తెలియజేస్తోంది. రానున్న సంవత్సరము అందరికీ శ్రీకరముగా నుండగలదని విశ్వసిస్తున్నాము. గత సంవత్సరములో (వికృతి నామ సంవత్సరములో) సంఘమిత్ర ఒక సంచిక కూడా వెలువడక పోవడానికి అనేక కారణములున్నప్పటికి - జరిగిన దానిని తలచుకుని చింతించే కంటే, తిరిగి సరికొత్తగా సంచికను వెలువరించడము ఉత్తమము కదా! సంచికను వెలువరించకపోవడానికి కారణమును అడుగుతూ ఎంతోమంది పాఠకులు వ్యక్తపరచిన ఆదరమునకు, అభిమానమునకు - వారికి సంఘమిత్ర మన: పూర్వకముగా ధన్యవాదములు తెలియజేస్తున్నది. మన పెద్దలు చెప్పిన విధముగా "ఉన్నత శిఖరములనైనా అధిరోహిస్తున్నప్పుడు క్రిందికి జారిపోవడము సహజమే - కాని జారిపోయిన ప్రతిసారి తిరిగి మళ్ళీ నిలబడి గమ్యము చేరే దీక్ష గలిగి ఉండడమే అభినందించవలసిన విషయము. క్రిందకు జారిపోకుండా ఉన్నత శిఖరములు చేరడము గొప్ప విషయమే అయినా - దాని వలన కొంతవరకు మనము నేర్చుకునే అవకాశమును కోల్పోతాము. కష్టమును అధిగమించి నిలిచినపుడే మన శక్తి మనకు తెలుస్తుంది." ఈ విధముగా సంఘమిత్ర అతి విలువైన పాఠములను నేర్చుకున్నది.

సంఘమిత్ర 'శ్రీనివాసరామానుజన్ మేధమేటిక్స్' ద్వారా వేసవిలో వేదగణిత పద్ధతులను నేర్పుతున్న విషయము మీకు తెలిసినదే. గత 2 సంవత్సరములలో కాలిఫోర్నియా, ఇండియాలలో నిర్వహించిన సదస్సులు చాలా మంది ప్రేక్షకులకు వేదగణిత పద్ధతుల గురించి కుతూహలమును కలిగించినదని విని, 2011లో ఇలాంటి సదస్సులను ఎక్కువగా నిర్వహించాలని ప్రయత్నిస్తున్నాము. వేదగణిత పద్ధతులను కుతూహలమున్నవారికి అందించడానికి http://www.e-gurukul.net చేస్తున్న కృషి అభినందనీయము. హైదరాబాద్‌కు చెందిన శ్రీ బి. సాయి కిరణ్ ఈ-గురుకుల్ నిర్వహిస్తున్న (ఆన్‌లైన్) ఉచిత బోధనా తరగతులలో శిక్షణనిస్తున్నారు. ఈ పద్ధతులను నేర్చుకోగోరినవారు http://www.e-gurukul.net లో మీ వివరములను నమోదు చేసుకొనవచ్చును.

జపాన్‌లో సంభవించిన భూకంపం మరియు సునామి మిగిల్చిన చేదు అనుభవము అందరినీ దిగ్భ్రాంతులను చేసింది. విధి నిర్ణయానికి మనము తలవంచవలసినదే కదా! మనవంతుగా ప్రపంచశాంతి కొఱకు ప్రార్థనలు నిర్వహించడము, సాధ్యమైనంతవరకు మన మనసును ప్రశాంతముగా ఉంచుకోవడము చేస్తే బాగుంటుంది. కాలుష్యము తగ్గించడానికి మనవంతు కృషి చేద్దాం! ప్లాస్టిక్ వినియోగము తగ్గించడము, పెట్రోలుతో నడిచే వాహనములను సాధ్యమైనంత తక్కువ వాడడము వలన వాతావరణ కాలుష్యమును; అలాగే శబ్ద కాలుష్యమును; మంచి విషయములను గురించి ప్రస్తావిస్తూ, చెడు ఆలోచనలకు దూరముగా ఉంటూ భావకాలుష్యమును మన మన పరిధిలో తగ్గిస్తే - ఈ ప్రపంచానికి ఎంతో మేలు చేసినవారమవుతాము. మీ అవకాశమును బట్టి - ముద్రా విజ్ఞానమును గురించి శ్రీ విజయకృష్ణ బన్సాల్ గారు అందించిన వివరములను http://www.mudravigyan.com లో చూడవచ్చు.

పాఠకులందరికి మరొకసారి వారి రచనలను పంపడానికి ఆహ్వానిస్తున్నాము. మీకు తెలిసిన విషయములను మిగిలిన పాఠక సోదరులతో పంచుకోడానికి ఇది చక్కని వేదిక. మీరు మీ ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలని అనుకుంటే ainapura@yahoo.com కి ఈ-మెయిలు పంపండి.

మళ్ళీ జులై సంచికలో కలుద్దాం! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.